సాక్షి ప్రకాశం

మంగళవారం । 9 । జనవరి । 2024



జగనన్న ప్రభుత్వంలో జవాబుదారీ పాలన

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. - 8లో..



ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా స్పందన నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మలికాగర్గ్ పేర్కొన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
29/22

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పొగమంచు ఎక్కువగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి

న్యూస్‌రీల్

ఒంగోలులో మరో కరోనా కేసు

ఒంగోలు టౌన్: ఒంగోలులో మరో కరోనా కేసు నమోదైంది. నగరంలోని లంబాడీడొంకలో నివసించే ఒక వ్యక్తి కొద్ది రోజులుగా జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులు వస్తున్నాయి. మందులు వాడినా నయం కాకపోవడతో ప్రైవేట్ వైద్యుడిని సంప్రదించారు. కోవిడ్ లక్షణాలుగా అనుమానం వచ్చిన ఆయన జీజీహెచ్‌కు పంపించారు. అక్కడ ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేయగా.. కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వెంటనే అతడ్ని జీజీహెచ్‌లోని ప్రత్యేక వార్డులో అడ్మిట్ చేసి చికిత్స అందిస్తున్నట్లు ఆర్‌ఎంఓ డాక్టర్ తిరుమలరావు తెలిపారు. వెంటనే కేసు వివరాలను జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ రాజ్యలక్ష్మికి సమాచారం అందించినట్లు తెలిపారు. రాడ్ బెండింగ్ పనిచేసే సదరు వ్యక్తి ఇటీవల కోల్‌కత్తాకు వెళ్లి వచ్చిన వ్యక్తితో కలిసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా మూడు రోజుల క్రితం రెండు కేసులు పాజిటివ్ వచ్చాయి. మళ్లీ ఇప్పుడు మరొకరికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో నగరంలో క్రమంగా కోవిడ్ కేసులు పెరుగుతున్నాయని చెప్పవచ్చు.

వాహనం ఢీకొని జింక మృతి



గాయపడిన జింక

సింగరాయకొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక తీవ్రంగా గాయపడి మృతి చెందింది. ఈ సంఘటన సోమవారం మండలంలోని కనమళ్ల చెరువు సమీపంలో కందుకూరు వెళ్లే రోడ్డుపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం .. కనమళ్ల చెరువు సమీపంలో మూడుజింకలు రోడ్డు దాటుతుండగా ఒక జింకను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జింకను ఎస్సై టి.శ్రీరాం ఇచ్చిన సమాచారంతో ఒంగోలు అటవీ శాఖాధికారి మోహన్‌రావు ప్రథమ చికిత్స చేసి ఒంగోలు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. నిబంధనల ప్రకారం జింక మృతదేహాన్ని ఖననం చేయనున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన పల్లామల్లి హైస్కూలు క్రీడాకారులు

చీమకుర్తి: క్రీడా పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు తమ ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించారు. చీమకుర్తి మండలం పల్లామల్లి జిల్లాపరిషత్ హైస్కూలుకు చెందిన జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్.రాంబాబు తెలిపారు. ఆదివారం ఒంగోలులోని ఏబీఎం కాలేజీలో నిర్వహించిన జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో సాయికుమార్, నాగదివ్య ఎంపికైనట్లు తెలిపారు. పీడీ స్వాతికిరణ్, ఎంపికైన క్రీడాకారులను హెచ్‌ఎంతో పాటు పాఠశాలలోని టీచర్‌లు అభినందించారు.

హాకీకి మైనంపాడు క్రీడాకారులు

సంతనూతలపాడు మండలం మైనంపాడులోని ప్రభుత్వ హైస్కూలుకు చెందిన విజయరాజ్, విష్ణు, కైలాస్‌కుమార్, గౌతమ్ శంకర్, చరణ్‌కుమార్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రవికుమార్ సోమవారం తెలిపారు. హెచ్‌ఎం నరసింహరావు, టీచర్‌లు క్రీడాకారులను అభినందించారు.

పండక్కి పోదాం..

సంక్రాంతి జర్నీ అంటే ప్రజలు భయపడే వారు ఒకప్పుడు. ప్రైవేట్ ట్రావెల్స్‌తో పాటు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసుల పేరుతో చార్జీలు భారీగా పెంచేవి. రైళ్లలో కూడా టిక్కెట్లు లభించేవి కాదు. దీంతో పండుగ ప్రయాణం భారంగా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తోంది. ఎలాంటి ఆర్థిక భారం మోపకుండా సాధారణ చార్జీలనే ఉంచింది. ఎలాంటి అదనపు బాదుడు లేకుండా జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు 165 ప్రత్యేక సర్వీసులను ఏపీఎస్ ఆర్టీసీ నడపనుంది. దీంతో పండక్కి వెళ్లేందుకు ప్రయాణికులు ఉత్సాహం చూపుతున్నారు



- అదనపు బాదుడు నుంచి విముక్తి
- సంక్రాంతికి 165 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు
- 5 డిపోల నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల జిల్లా వాసులకు సౌకర్యం
- ప్రయాణికుల రద్దీ ఆధారంగా మరిన్ని సర్వీసులు
- రానుపోను రిజర్వేషన్ చేసుకుంటే పది శాతం రాయితీ

ఒంగోలు: విద్య, ఉద్యోగ, వ్యాపార, ఉపాధి నిమిత్తం సుదూర ప్రాంతాలకు వెళ్లిన వారు అతి పెద్ద పండుగలైన సంక్రాంతి, దసరాలకు స్వగ్రామాలకు వెళ్లాని ఉవ్విళ్లూరుతుంటారు. ఏ పండుగకు వచ్చినా రాకున్నా సంక్రాంతికి మాత్రం స్వగ్రామాలకు చేరుకుని చిన్ననాటి స్నేహితులు, బంధుమిత్రులతో సరదాగా గడపడం దశాబ్దాల నాటి నుంచి వస్తున్న ఒక మంచి సంప్రదాయం. దీనిని దృష్టిలో ఉంచుకుని సంక్రాంతి, దసరా పండుల నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతూ వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పండుగలప్పుడు వేసే బస్సుల్లో సాధారణ చార్జీల కంటే అదనంగా 50 శాతం చార్జీలను పెంచేది. ఇక ప్రైవేట్ బస్సులైతే రెండు, మూడు రెట్లు పెంచేసి ప్రయాణికులపై భారీగా ఆర్థిక భారాన్ని మోపాయి. ఇక రైళ్లలో ప్రయాణించాలంటే వెయిటింగ్ లిస్టు చాంతాండంత ఉండేది. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో బస్సుల్లో అదనపు భారీ చార్జీల భారాన్ని మోస్తూ సొంతూళ్లకు వెళ్లేవారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత దోపిడీ స్థానంలో ఆత్మీయతను పంచుతూ 50 శాతం అదనపు బాదుడు నుంచి విముక్తి కల్పించారు. పండుగ వేళ ప్రతి ఒక్కరూ సంతోషంగా స్వగ్రామాలకు చేరుకునేలా అవకాశాన్ని కల్పించారు.

జిల్లాలో 165 ప్రత్యేక బస్సులు:

గిద్దలూరు, మార్కాపురం, పొదిలి, కనిగిరి, ఒంగోలు డిపోలు ఉన్నాయి. ఐదు డిపోల ద్వారా ఈ నెల 9వ తేదీ నుంచి స్పెషల్ బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేస్తోంది. హైదరాబాద్ నుంచి 150 సర్వీసులు, బెంగళూరు నుంచి 5, చెన్నై నుంచి 10 సర్వీసులు ప్రస్తుతానికి ఆన్‌లైన్ రిజర్వేషన్ అమలుచేస్తున్నారు. ఈ బస్సులకు సంబంధించి ముందస్తు రిజర్వేషన్ సౌకర్యంతో పాటు అదనపు ఛార్జీల భారాన్ని తొలగించారు. ప్రయాణికులకు చిల్లర సమస్య లేకుండా ఫోన్‌పే, గూగుల్‌పే, క్యూఆర్ కోడ్ స్కానింగ్ సౌకర్యం ఏర్పాటుచేశారు. రానుపోను ఒకేసారి టిక్కెట్ రిజర్వు చేసుకుంటే 10శాతం రాయితీ కూడా అందిస్తున్నారు. ఇక ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేకంగా కాల్ సెంటర్ సౌకర్యం కల్పించారు. అందులో 149 లేదా 0866-2570005 నంబర్‌ను నిత్యం సేవలు అందించేలా ఏర్పాటుచేశారు. ఇదే కాకుండా ప్రతి బస్సుకు జీపీఎస్ సౌకర్యం కూడా అమర్చారు. అత్యధికంగా 11వ తేదీ 39 బస్సులు, 12వ తేదీ 55 సర్వీసులు, 13వ తేదీ 44 సర్వీసులు అందుబాటులోకి తెచ్చారు. వీటిలో 72 సూపర్ లగ్జరీ, 57 సర్వీసులు అల్ట్రాడీలక్స్ పండుగ స్పెషల్‌గా ఏర్పాటు చేశారు. అలాగే తిరుగు ప్రయాణంలో కూడా ఈ నగరాలకు బస్సులను నడుపనుంది.

11, 12 తేదీల్లో అత్యధిక బస్సులు

సంక్రాంతి పండుగ సందర్భంగా 50 శాతం అదనపు చార్జీని ఈ దఫా కూడా అమలుచేయడంలేదు. ఇప్పటికే 165 సర్వీసులు అందుబాటులోకి తెచ్చాం. ఇవే కాకుండా అవసరం అయితే అదనంగా సర్వీసులు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రజలకు నగదు రహిత లావాదేవీల ద్వారా కూడా టికెట్ ధర చెల్లించేందుకు అవకాశం కల్పించాం. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం.

– బి.సుధాకర్‌రావు,
జిల్లా ప్రజా రవాణా అధికారి



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- స్పందనలో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారంపై గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం స్పందన హాలులో స్పందన నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో 230 అర్జీలు వచ్చాయన్నారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులు నిర్దిష్ట గడువు లోగా పరిష్కారం చేయాలన్నారు. మొక్కుబడిగా కాకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి రీ ఓపెన్ కాకుండా సహేతుకంగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించ లేని సమస్యలు ఉంటే అర్జీదారులను పిలిచి వివరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి దూర ప్రాంత ప్రజల సమస్యలను తెలుసుకుని సంబంధత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఉమాదేవి, లోకేశ్వరరావు, వరకుమార్, ఝాన్సీ, లక్ష్మీ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పొదిలి మండలం మల్లవరం గ్రామానికి చెందిన వెంకటరెడ్డి డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి సర్వే నెంబర్153-1, 153-2 ఖతా నెంబర్ 919లో భూమి వివాదంలో ఉందని అయితే సదరు భూమిని ఎవరూ సాగు చేయకపోయినా సీసీఆర్‌సీ కార్డును ఇచ్చారని ఫిర్యాదు చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జరుగుమల్లి మండలం పాలేటిపాడు గ్రామానికి చెందిన వెంకాయమ్మ తన భూమిని సర్వే చేశారని అయితే ఉండాల్సిన విస్తీర్ణం కన్నా 14సెంట్లు తక్కువగా ఆన్‌లైన్‌లో నమోదు చేసారని తెలిపింది. మిగిలిని భూమిని కూడా ఆన్‌లైన్‌లో ఎక్కించి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ అందచేసింది.



బారులుతీరిన అర్జీదారులు

పారదర్శక పాలన జగనన్నకే సాధ్యం

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



టంగుటూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

టంగుటూరు: పారదర్శకంగా అవినీతి రహిత పాలనలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పి.కోటేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన నూతన పింఛన్ల పంపిణీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి ఇంటికే సేవలన్నీ అందేలా వ్యవస్థను రూపొందించారన్నారు. ఈ రెండు వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచి ఎన్నో రాష్ట్రాలు సైతం అమలు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించాయని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీనే 95 శాతం పింఛన్లను ఠంచన్‌గా ఇంటి వద్దకే వచ్చి వలంటీర్లు అందచేయడం గొప్ప విషయమన్నారు. గతంలో పెన్షన్ల కోసం కార్యాలయాల వద్ద పడిగాపులు కాసే పరిస్థితి నుంచి ఇంటి వద్దకే వచ్చేలా జగనన్న ఏర్పాటు చేశారని కొనియాడారు. రైతు భరోసా, చేయూత, ఆసరా, విద్యా కానుక, వసతి దీవెన తదితర పథకాల్లో ఎక్కడా దాపరికం లేకుండా పారదర్శకంగా అమలు చేస్తూ నేరుగా లబ్ధిదారుల ఖాతాకే నగదు జమవుతుందని తెలిపారు. మండలంలోని నాలుగున్నరేళ్ల కాలంలో రూ.100 కోట్లకు పైగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచి మాట తప్పని నాయకుడిగా మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించుకున్నారని కొనియాడారు. విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా ఒక్కో విద్యార్థికి రూ.కోటి సైతం ప్రభుత్వం అందజేస్తూ పేదల ఉన్నత చదువులకు అండగా ఉంటుందన్నారు. జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సముచిత న్యాయం కల్పించి ఉన్నత పదవులు కేటాయించారన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ లబ్ధిదారుల ఖాతాల్లో ఇన్ని లక్షల కోట్ల రూపాయలు జమ చేసిన చరిత్ర లేదన్నారు. కరోనా కష్టకాలంలో కూడా సంక్షేమ పథకాలు ఆగకుండా అందించారని కొనియాడారు. గ్రామాల్లోని సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు ప్రజల పాలిట ఆధునిక దేవాలయాలన్నారు. ఈ కేంద్రాలకు వెళితే గ్రామాల్లోనే వారి సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. అనంతరం పీఎంజీపీ కింద సబ్సిడీపై కారు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మంత్రి సురేష్‌కు వినతిపత్రం అందజేయగా..సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు.

నేను కృష్ణుడిని కాదు ఏకలవ్యుడిని..

కనిగిరి సభలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను మంత్రి సురేష్ ఖండించారు. చంద్రబాబు అన్నట్లు తాను కృష్ణుడిని కాదని, జగనన్న ఏకలవ్యుడినని, ఏకలవ్యుడు బొటన వేలు ఇస్తే జగనన్న కోసం ప్రాణాలు సైతం ఇవ్వడానికి వెనుకాడనన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమం, రెండు కళ్లుగా పాలన అందుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబుకు వేరే పార్టీలతో పొత్తులు కావాలని, జగనన్నకు ప్రజలతోనే పొత్తని స్పష్టం చేశారు. మీ ఇంట్లో మంచి జరిగితే నాకు ఓటు వేయండని చెప్పే ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ పీడీ వసుంధర, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటి అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ లింగంగుంట రవిబాబు, రాష్ట్ర గొర్రెల పెంపకందారుల అధ్యక్షుడు బొట్ల రామారావు, వైస్ ఎంపీపీ దగ్గుమాటి సుమన్‌రెడ్డి, కుందం హనుమారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వేతన బకాయిల మంజూరుపై కాంట్రాక్టు లెక్చరర్ల హర్షం

ఒంగోలు: కాంట్రాక్టు లెక్చరర్లకు 2022-23 విద్యా సంవత్సరం ఏప్రిల్, మే నెల(వేసవి కాలానికి సంబంధించి) వేతనాన్ని ప్రభుత్వం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి సంబంధించి ఇంటర్మీడియెట్ విద్య కమిషనర్ త్వరగా ప్రొసీడింగ్స్ జారీ చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు ప్రభుత్వ కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ రాష్ట్ర చైర్మన్ కుమ్మరకుంట సురేష్, కోచైర్మన్ కల్లూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో కాంట్రాక్టు లెక్చరర్లు ప్రత్యేకంగా తరగతులకు హాజరై సప్లిమెంటరీ పరీక్షల ఉత్తీర్ణత పెంపులో కీలకంగా కృషి చేశారన్నారు. కాంట్రాక్టు లెక్చరర్ల సేవలను గుర్తించి వేతనం మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్, సీఎంఓ అధికారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రభుత్వ నిర్ణయంపై ఏపీటీజీ హర్షం

ఒంగోలు: జీరో ఎన్‌రోల్‌మెంట్ నమోదైన పాఠశాలల్లోని ఉపాధ్యాయులను ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 2022-23లో జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలు 76 గుర్తించగా, వాటిలో ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి 13 ఉన్నాయన్నారు. ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లోకి సర్దుబాటు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

5వేల రేషన్ కార్డులు మంజూరు

- కార్డుదారులకు ఈ నెల నుంచి నరుకుల పంపిణీ
- జిల్లాలో మొత్తం 6,73,160 రేషన్ కార్డులు

ఒంగోలు అర్బన్: జిల్లాకు నూతనంగా 5 వేల రేషన్ కార్డులు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి అర్హులై ఉండి ఏవైనా కారణాలతో రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు అందకుంటే అటువంటి వారి కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తోంది. దీనిలో భాగంగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కార్డులు మంజూరు చేశారు. మంజూరైన కార్డులు గ్రామ రెవెన్యూ అధికారి లాగిన్ ద్వారా వలంటీర్లు ఇంటి వద్దకే అందజేస్తున్నారు. కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారికి ఈ నెల నుంచే రేషన్ సరుకులు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు ఎండీయూ వాహన నిర్వాహకులకు సివిల్ సప్లయిస్ అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే జిల్లాలో ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కార్డులు 6,40,058, ఏఏవై కార్డులు 33,102తో కలిపి మొత్తం 6,73,60కార్డులు ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా మరో 5వేల కార్డులు మంజూరు చేశారు. కార్డుదారుల కుటుంబాలకు రేషన్ సరుకులు ఇంటి వద్దకే అందించేందుకు జిల్లాలో 385 ఎండీయు వాహనాలు సేవలందిస్తున్నాయి.

పారదర్శకంగా రేషన్ సరుకులు పంపిణీ




ప్రతి నెల 1వ తేదీ నుంచి రేషన్ సరుకులు కార్డుదారుల ఇంటి వద్దకే ఎండీయూ వాహనాల ద్వారా పారదర్శకంగా సరుకులు పంపిణీ చేస్తున్నాం. పంపిణీ జరిగే సమయంలో సివిల్ సప్లయిస్ అధికారులు, వీఆర్‌ఓలు విధిగా పర్యవేక్షిస్తున్నారు. కార్డుదారులంతా తప్పనిసరిగా రేషన్ సరుకులు తీసుకుని సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ ఉత్తర్వులతో జిల్లాలో కొత్తగా 5వేల కుంటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు చేశాం. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు రేషన్ సరుకుల పంపిణీపై నిరంతరం సమీక్షిస్తూ తగిన సూచనలు చేస్తున్నారు.

– ఏ. ఉదయభాస్కర్,
జిల్లా పౌరసరఫరాల అధికారి

10న అంబులెన్స్ వేలం

ఒంగోలు అర్బన్: జిల్లా కారాగారం వద్ద గుంటూరు పరిధి డీఐజీ సమక్షంలో కారాగారానికి చెందిన కాలం చెల్లిన మారుతి అంబులెన్స్ వాహనాన్ని విక్రయించేందుకు ఈ నెల 10వ తేది ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కారాగారం పర్యవేక్షణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఈఎండీ రూపంలో రూ.2500 జిల్లా జైలు కార్యాలయంలో డిపాజిట్ చెల్లించాలన్నారు. కొనుగోలు చేయని వారి డిపాజిట్ నగదును తిరిగి వెనక్కి ఇస్తామని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన వారు అదనంగా 18శాతం జీఎస్‌టీతో పూర్తి మొత్తాన్ని చెల్లించాలని తెలిపారు. కొనుగోలు చేసిన వారు అదేరోజు వాహనాన్ని తీసుకువెళ్లాలని, లేకుంటే ఈఎండీ మొత్తం జప్తు చేస్తామని స్పష్టం చేశారు.

అంతర సేద్యంతో అధిక దిగుబడి



పొగాకు తోటలను పరిశీలిస్తున్న ఆక్షన్ మేనేజర్ వేణుగోపాల్, ప్రాంతీయ అధికారి లక్ష్మణరావు

టంగుటూరు: పొగాకు తోటల్లో అంతర సేద్యం చేసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చని ఆక్షన్ మేనేజర్ వేణుగోపాల్, ప్రాంతీయ అధికారి ఎం లక్ష్మణరావు సూచించారు. స్థానిక వేలం కేంద్రం పరిధిలోని టంగుటూరు, ఆలకూరపాడు, అనంతవరం గ్రామాల్లోని పొగాకు తోటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు లద్దె పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోయెట్ 5 గ్రాముల మందును 10 లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేయాలని సూచించారు. శనగ పచ్చ పురుగు ఉంటే ఇమిడా క్లోప్రిడ్ 3 మిల్లీ లీటర్ల మందును 20 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు, ఎస్జీఓ సిద్దరాజు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

చినగంజాం: ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక ఉంటుందని జిల్లా కబడ్డీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెరుకూరి పుల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు బాలురు బరువు 70 కేజీలు, బాలికలు బరుకు 65 కేజీల్లోపు ఉండాలని, అలాగే 20 సంవత్సరాల్లోపు వారై ఉండాలన్నారు. ఫిబ్రవరి 2004 లోపు పుట్టిన వారై ఉండాలని తెలిపారు. ఎంపికైన జట్లు ఈనెల 20 తేదీ నుంచి 23వ తేదీ వరకు నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని, క్రీడాకారులు తమ వెంట ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. వివరాలకు 83010 15775ను సంప్రదించాలని కోరారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

మద్దిపూడి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మద్దిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఫ్రెండ్స్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 26 జట్లు పాల్గొన్నాయి. సీనియర్స్ విభాగంలో కనిగిరి రివెంజర్స్, దర్శి జట్ల మధ్య తొలి పోటీ నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో విజేతలకు ప్రథమ బహుమతి రూ.12,116, ద్వితీయ బహుమతి రూ.8,116, తృతీయ బహుమతి రూ.6,116, అలాగే అండర్–19 విభాగంలో విజేతలకు మొదటి బహుమతి రూ.3116లు, రెండో బహుమతి రూ.2116 అందజేస్తామని నిర్వాహకులు పవన్, ప్రవీణ్, బాలు, నరేంద్ర, వెంకటేష్, శ్రీకాంత్, బ్రహ్మం, సాయి తెలిపారు.

జగనన్న ప్రభుత్వంలో జవాబుదారీ పాలన

- టీడీపీ పాలనకు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి తేడాను గమనించండి
- సంక్షేమం, అభివృద్ధి కొనసాగేలా మరోమారు దీవించండి
- హామీలను తుంగలో తొక్కిన చంద్రబాబును శాశ్వతంగా సాగనంపాలి
- బాబు జమానాలో అన్ని వర్గాలకూ అన్యాయం
- వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీలో మంత్రి ఆదిమూలపు సురేష్



కొండపిలో లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేస్తున్న మంత్రి సురేష్

కొండపి(సింగరాయకొండ): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. కొండపి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం మధ్యాహ్నం వైఎస్సార్ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతతో సమానంగా చూస్తానని ప్రకటించిన వైఎస్ జగన్.. అధికారం చేపట్టిన తర్వాత 99 శాతం హామీలు అమలు చేశారని పేర్కొన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛనుదారుల ఇంటి తలుపుతట్టి నగదు ఇస్తోంది దేశం మొత్తం మీద ఏపీలో మాత్రమేనన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ వ్యవస్థ, ఆర్బీకేల ఏర్పాటు, నాడు–నేడు కార్యక్రమాలతో పరిపాలనలో సమూల మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టం జరిగితే కొంతమంది రైతులకే పరిహారం ఇచ్చి చేతులు దులిపేసుకున్నారని, ప్రస్తుతం ఈ క్రాప్‌లో నమోదై పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందుతోందన్నారు. కొండపి మండలంలో 6,485 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.1.88 కోట్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిల మార్పు, తనను నాలుగో కృష్ణుడిగా అభివర్ణించడంపై మంత్రి స్పందించారు. నియోజవర్గంలో ఎవరున్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే చూసి ఓటేయాలని ప్రజలను కోరారు. కొండపి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి సురేష్ భరోసా ఇచ్చారు. అనంతరం నూతన పింఛన్లు మంజూరు చేశారు. డ్వాక్రా మహిళలకు పీఎంఈజీపీ పథకం కింద రెండు యూనిట్లకు 4 లక్షల రూపాయల చెక్కు అందజేశారు. జవాబుదారీ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మరోమారు దీవించాలని అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలను మంత్రి కోరారు.

చంద్రబాబు పాలనలో దగా

టీడీపీ జమానాలో పింఛనుదారులు రోజుల తరబడి పంచాయతీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన దుస్థితిని గుర్తు చేశారు. 2014లో జాబు ఇస్తా, రుణమాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి రాగానే హామీలను తుంగలో తొక్కాడని విమర్శించారు. బాబు పాలనలో ఇళ్లు, పింఛన్లు, ఇతర ప్రభుత్వ పథకాలు పచ్చ చొక్కాలకే దక్కాయన్నారు. 70 ఏళ్ల వృద్ధులకు కూడా పింఛను మంజూరు చేయకుండా దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. కాగా ప్రొటోకాల్ పాటించకపోవడం, లబ్ధిదారుల అభిప్రాయలు చెప్పించడంలో విఫలమైన ఎంపీడీఓ రమణమూర్తిపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు.

డీఆర్‌డీఏ పీడీ వసుంధర, జెడ్పీటీసీ మారెడ్డి అరుణకుమారి, వైస్ ఎంపీపీ కోటరాజు, వేముల ప్రసాద్, కొండపి సొసైటీ చైర్మన్ బొక్కిసం ఉపేంద్ర, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అరికట్ల కోటిలింగం, రాష్ట్ర సహాయ కార్యదర్శి డాకా పిచ్చిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, బొక్కిసం సుబ్బారావు, సర్పంచ్ భువనగిరి సత్యం పంతులు, షేక్ వన్నూరు, దివి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

జగనన్న నమ్మకాన్ని వమ్ము చేయను

- యర్రగొండపాలెం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్



తాటిపర్తి చంద్రశేఖర్

సింగరాయకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా యర్రగొండపాలెం నియోజకవర్గంలో భారీ మెజారిటీతో విజయం సాధిస్తానని తాటిపర్తి చంద్రశేఖర్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసుల రెడ్డి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి, జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, పార్టీ రీజియన్ కోఆర్డినేటర్, రాజ్యసభ ఎంపి విజయసాయిరెడ్డి సూచనలు, సలహాలతో రాబోయే ఎన్నికల్లో వైపాలెం నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ సాధించేందుకు కృషి చేస్తానన్నారు. మహానేత వైఎస్సార్ స్ఫూర్తితో గత 15 ఏళ్లుగా పేద ప్రజల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానన్నారు. గత రెండు ఎన్నికల్లో టికెట్ రాకపోయినా నిరుత్సాహపడకుండా వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేసినట్లు చెప్పారు. తన వదిన తాటిపర్తి వనజమ్మను సింగరాయకొండ సర్పంచ్‌గా భారీ మెజారిటీతో గెలిపించడంతోపాటు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశానన్నారు. యర్రగొండపాలెంలో గ్రూపుల సమస్య ఉందని పచ్చ పత్రికలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. త్వరలోనే మంత్రి సురేష్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డితో కలిసి వైపాలెం నియోజకవర్గంలో పర్యటిస్తానన్నారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమకు అండగా ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో విజయం వైఎస్సార్ సీపీదేనని ఉద్ఘాటించారు.

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం



హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి నగదు అందిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

- అర్జీదారులకు ఎస్పీ మలికా గర్గ్ భరోసా
- పోలీస్ స్పందనకు 110 అర్జీలు

ఒంగోలు సబర్బన్: ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మలికా గర్గ్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని గెలాక్సీ భవన్‌లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ఎస్పీ స్పందనకు 110 ఫిర్యాదులు వచ్చాయి. అర్జీదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ సమస్య పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అర్జీలలో కుటుంబ కలహాలు, భార్యాభర్తల, అత్తారింటి వేధింపులు, భూ వివాదాలు, జాబ్ మోసాలతో పాటు ఇతర సమస్యల గురించి ప్రజలు వినతులు సమర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ(క్రైమ్స్)శ్రీధర రావు, ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, దిశ డీఎస్పీ సీహెచ్.శ్రీనివాసరావు, ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ, స్పందన సిబ్బందితో పాటు పలువురు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఒంగోలు సబర్బన్: జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తూ డిప్యుటేషన్‌పై గుంతకల్లు రైల్వే డివిజన్లో విధులు నిర్వర్తిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బి.పూర్ణ మల్లేశ్వరరావు(హెచ్‌సీ–821) కుటుంబానికి 1998 బ్యాచ్ పోలీసులు ఆర్థిక సాయం అందించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్ సతీమణి శివపార్వతికి ఎస్పీ మలికగర్గ్ చేతులమీదుగా రూ.1.36 లక్షల నగదు అందించారు. దొనకొండ రైల్వే స్టేషన్ కేంద్రంగా జీఆర్పీలో పనిచేస్తున్న పూర్ణ మల్లేశ్వరరావు 2023 అక్టోబర్ 29న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కార్యక్రమంలో 1998 బ్యాచ్‌కు చెందిన పోలీసులు ఎన్.శ్రీనివాసరావు, జి.పూర్ణచంద్రరావు, ఎస్‌కే ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.25 లక్షల విరాళం



పూజల్లో పాల్గొన్న పవన్‌కుమార్ దంపతులు

మార్కాపురం: శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ రాజప్రాకార గోపురాల నిర్మాణంలో భాగంగా ఆలయంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. పేరం సత్యనారాయణ, పవన్‌కుమార్ దంపతులు ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. ఇందుకోసం రూ.25 లక్షల విరాళాన్ని అందజేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పెనుగొండ కేశవరావు తెలిపారు. దాతల సహకారంతో ఆలయంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రధాన అర్చకులు అప్పనాచార్యులు, ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి బొగ్గరపు శేషయ్య తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

625 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



సింగరాయకొండ ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో బియ్యం అప్పగిస్తున్న అధికారులు

టంగుటూరు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వల్లూరు సమీపంలో సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ.. తమిళనాడు రాష్ట్రం నుంచి చత్తీస్‌ఘడ్‌కు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా విజిలెన్స్ ఏఎస్పీ భవానీహర్ష ఆదేశాల మేరకు పౌరసరఫరాశాఖ అధికారులతో కలిసి వల్లూరు వద్ద వాహనాలు తనిఖీ చేశామన్నారు. ఓ లారీలో 30,086 కేజీల బియ్యం(625 బస్తాలు) గుర్తించామన్నారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు గ్రామాలతోపాటు తమిళనాడు పీడీఎస్ బాయిల్డ్ రైస్ కార్డు హోల్డర్ నుంచి బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి చత్తీస్‌ఘడ్‌లో అధిక ధరకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. బియ్యంతో సహా లారీని సీజ్ చేసి వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన బియ్యం బస్తాలను సింగరాయకొండ ఎంఎల్‌ఎస్ పాయింట్ డీటీకి, లారీని టంగుటూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు చెప్పారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కృష్ణమోహన్, సీఐ రాఘవరావు, ఎస్సై నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు

క్రికెట్ పండగ మొదలైంది..

- పానెం హనిమిరెడ్డీస్ జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీ
- పోటీల్లో పాల్గొననున్న రంజీ, ఐపీఎల్ క్రీడాకారులు
- 29 ఏళ్లుగా కొండమంజులూరులో క్రికెట్ పోటీలు
- నేడు పోటీలను ప్రారంభించనున్న హనిమిరెడ్డి



కొండమంజులూరు క్రికెట్ పోటీలకు సిద్ధమైన క్రీడాప్రాంగణం

జే.పంగులూరు: సంక్రాంతి పండగ సంబరాలకు ముందే ఆటల పోటీలు సంతోషాలను తీసుకువస్తున్నాయి. ఆటలు మానసిక దృఢత్వానికే కాదు ఐకమత్యానికి కూడా దోహదపడుతాయనడంలో సందేహం లేదు. అందునా పండగ సమయాల్లో అయితే మరీనూ. ఎక్కడెక్కడో ఉన్న వాళ్లంతా సొంతూరుకు వచ్చి ఆటలు ఆడుతుంటే ఆనందమే వేరు కదా. పంగులూరు మండలానికి క్రీడల విషయంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. పంగులూరు గ్రామం అంటే ఖోఖోకు ప్రత్యేక స్థానం. పంగులూరులోని జూనియర్ కళాశాల ఖోఖో జాతీయస్థాయిలో నిర్వహించారు. ఆదేస్థాయిలో గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు కొండమంజులూరు క్రికెట్ క్లబ్ నిర్వాహకులు. గ్రామంలో 1995లో కొండమంజులూరు క్రికెట్ క్లబ్ ఏర్పడింది. అప్పటి నుంచి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో గత 26 ఏళ్లుగా రాష్ట్రస్థాయిలో క్రికెట్ పోటీలు సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్నారు. రెండేళ్లుగా నుంచి దక్షిణ భారతదేశ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈఏడాది 29వ సారి జాతీయస్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు క్లబ్ చైర్మన్ కరణం స్వామి, బొప్పూడి వెంకన్నబాబు తెలిపారు. పోటీలను అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

టోర్నమెంట్‌లో రంజీ, ఐపీఎల్ క్రీడాకారులు..

ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి అత్యంత ప్రతిష్టాత్మకంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఐపీఎల్, రంజీ ట్రోఫీ ఆటగాళ్లు కూడా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జనవరి 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈపోటీల కోసం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని సిద్ధం చేశారు. పిచ్, అవుట్ ఫీల్డ్ అంతా సిద్ధం చేశారు. టోర్నమెంట్‌లో ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, ఉత్తరప్రదేశ్, జమ్మూకాశ్మీర్, జార్ఖండ్, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా తదితర ప్రాంతాల నుంచి క్రికెట్ టీములు వచ్చాయి.

చీర్‌గాల్స్, డీజే సౌండ్స్..

మ్యాచ్ సమయంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఐపీఎల్ తరహాలో చీర్‌గాల్స్, డీజే సౌండ్స్, తీన్‌మార్ ఏర్పాటు చేస్తున్నారు. క్రీడాకారులకు భోజన సదుపాయం, వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రికెట్‌లో మంచి ప్రతిభ కనబరిచిన ప్రతి క్రీడాకారులను ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు.

బహుమతులు..

టోర్నమెంట్‌లో మొదటి బహుమతి రూ. 6 లక్షలు వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి అందిస్తున్నారు. రెండో బహుమతి రూ. 4 లక్షలు వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ బీవీ క్రిష్టారెడ్డి అందిస్తున్నారు. మూడో బహుమతిని రూ.2 లక్షలు కొండమంజులూరు క్రికెట్ క్లబ్ చైర్మన్ కరణం స్వామి అందిస్తున్నారు. ప్రతి స్థానానికి క్రికెట్ క్లబ్, గ్రామస్తుల సహకారంతో షీల్డ్ అందించనున్నారు.

తైక్వాండో రాష్ట్ర స్థాయి క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు, రెఫరీలు

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో మార్కాపురంలో రాక్వెల్ స్కూల్ ఆవరణంలో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల, బాలికల తైక్వాండో ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి క్రీడాకారుల హాజరైనట్లు జిల్లా కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్ సలాం తెలిపారు. సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారుల ఈ నెల 20, 21వ తేదీల్లో నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో మార్కాపురం మొదటి స్థానంలో కైవసం చేసుకోగా చీరాల ద్వితీయ స్థానం, కందుకూరు తృతీయ స్థానంలో నిలిచాయి.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు వీరే..

బాలికల విభాగంలో.. సమత (చినగంజాం), తనుశ్రీ (చీరాల), కోమలి, దేవర్శినిలు (మార్కాపురం), మేఘన (చీరాల), కీర్తి (కందుకూరు), సమీహా ఫాతిర (కందుకూరు), గోదా (మార్కాపురం), జ్ఞాపిక (మార్కాపురం). బాలుర విభాగంలో... లీలా మాధవ్ (చీరాల), శస్య (కందుకూరు), సాకేత్ (కందుకూరు) మౌనిక (మార్కాపురం), విజయ్‌కుమార్ (చీరాల), సాహిల్ (చీరాల), జోష్నాద్ (చీరాల), సాదిక్ (మార్కాపురం), సిద్ధిక్ (మార్కాపురం), విపుల్ కృష్ణ (చీరాల), హస్టిల్ (మార్కాపురం), జస్వంత్ (చీరాల)లు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, కార్యదర్శి అబ్దుల్ సలామ్‌లు అభినందించారు. ఈ పోటీలకు షాహిద్, మసూద్, స్టీఫెన్ జాన్‌పాల్, మేరిస్టెల్లా, వినీతలు రెఫరీలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు ఎస్‌డీ.సలావుద్దీన్, జె.ముఖేష్ కుమార్, పి.అఖిల్, పి.ప్రశాంత్, సీహెచ్.ప్రసాద్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కంభం ఎస్‌బీఐ ఎదుట చోరీ

- బైక్ కవర్ నుంచి రూ.2.50 లక్షలు అపహరణ



బాధితుడు నగదు ఉంచిన బైక్

కంభం: బైక్ ట్యాంక్ కవర్‌లో నగదు ఉంచి ఫోన్ మాట్లాడుతూ ఏమరపాటుగా ఉన్న వ్యక్తి నుంచి గుర్తు తెలియని వ్యక్తి చాకచక్యంగా డబ్బు కాజేశాడు. ఈ సంఘటన సోమవారం మధ్యాహ్నం కంభం పట్టణంలో ఎస్‌బీఐ ఎదురుగా చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. అర్ధవీడు మండలం అయ్యవారిపల్లికి చెందిన ఓ వ్యక్తి కంభం ఎస్‌బీఐలో రూ.2.50 లక్షల నగదు విత్ డ్రా చేశాడు. బ్యాంకు బయటకు వచ్చి తన ద్విచక్ర వాహనం ట్యాంక్ కవర్‌లో నగదు ఉన్న సంచిని పెట్టి వెనక్కు తిరిగి ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తి నగదు అపహరించుకెళ్లాడు. నగదు పోయిన విషయాన్ని గ్రహించిన బాధితుడు చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకుండా పోయింది. చోరీ తీరును పరిశీలిస్తే.. దొంగ ముందుగానే ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు.. సీసీ కెమెరాల ఫుటేజీను పరిశీలిస్తున్నారు. గతంలో సైతం ఎస్‌బీఐ వద్ద పలు ద్విచక్రవాహనాలు, నగదు అపహరణకు గురైన సంఘటనలు ఉన్నాయని ఈ ప్రాంతంలో పోలీసులు నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రావెల్స్ బస్ ఢీకొని రైతు మృతి



తీవ్రంగా గాయపడి మృతి చెందిన సుబ్బారెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని ఒందుట్ల సమీపంలో కోల్డ్ స్టోరేజీ వద్ద మోటార్‌సైకిల్‌ను ట్రావెల్స్‌బస్ ఢీకొనడంతో తీవ్ర గాయాలై ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి ఒంగోలు–నంద్యాల హైవే రోడ్డుపై చోటుచేసుకుంది. బేస్తవారిపేట మండలం పెద్ద ఓబినేనిపల్లెకు చెందిన వెన్నా సుబ్బారెడ్డి(52) ఒంకారపురానికి చెందిన ఓ రైతుకు ఎద్దులు విక్రయించారు. నగదు తీసుకుని స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నారు. అయ్యప్పస్వామి భక్తులతో శబరిమలకు వెళ్తున్న ట్రావెల్స్ బస్ ఒందుట్ల సమీపంలో ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. సుబ్బారెడ్డి తలపగిలి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలిస్తుండగా మార్గమధ్యంలో పొదిలి వద్ద మృతి చెందారు. మృతుడికి భార్య సుబ్బమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.నరసింహారావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

మార్కాపురం: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మరణించిన సంఘటన సోమవారం స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద చోటుచేసుకుందని పట్టణ ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. తర్లుపాడు మండలం కందళ్లపల్లి గ్రామానికి చెందిన చెన్నయ్యభార్య గురవమ్మ (70) మార్కాపురం పట్టణానికి వైద్య పరీక్షల నిమిత్తం తన బంధువుతో కలిసి బైక్‌పై వస్తుండగా ఎస్టేట్ వద్ద ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని హుటాహుటిన మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించి చికిత్స చేస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కోనంకిలో పట్టపగలే భారీ చోరీ

- రూ.5 లక్షల విలువైన నగలు, నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

మార్టూరు: దొంగలు చెలరేగిపోయారు. ఇన్ని రోజులు రాత్రిళ్లు దొంగతనం చేస్తారులే అనుకునేవాళ్లం. కాని దొంగలు ఇప్పుడు కొత్తగా రూటు మార్చారు. దర్జాగా పట్టపగలే దోచుకోవడం మొదలు పెట్టారు. మండలంలోని జాతీయ రహదారి పక్కన గల కోనంకి గ్రామం మెయిన్ సెంటర్లో సోమవారం సాయంత్రం ప్రభుత్వ ఉపాధ్యాయుల ఇంట్లో భారీ చోరీ జరిగింది. అందిన వివరాల మేరకు.. కోనంకికి చెందిన తవ్వా వాసుదేవరావు మండలంలోని తాటివారిపాలెం గ్రామంలో, ఆయన భార్య వెంకట శ్యామలా దేవి మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. సాయంత్రం నాలుగున్నర గంటలకు ముందుగా ఇంటికి వచ్చిన వెంకట శ్యామలా దేవి తమ ఇంటి తలుపు తాళం పగులగొట్టి ఉండటం గమనించి భర్తకు, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ పి.అక్కేశ్వరరావు ఎస్సై శ్రీనివాసరావు చోరీ జరిగిన ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. బెడ్ రూమ్‌లోని బీరువాలో దాచి ఉంచిన సుమారు 7 కిలోల వెండి, 8 గ్రాముల బంగారు చైను, రూ.50 వేల నగదు చోరీకి గురైనట్లు బాధిత ఉపాధ్యాయుడు వాసుదేవరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒంగోలు నుంచి రాత్రి 8 గంటల సమయంలో క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.